# సాక్షి జగిత్యాల

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



## భరణి నక్షత్ర పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి నుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్ర వారం భరణి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



## రాజన్నకు మొక్కుల హోరతి

రాజన్నను శుక్రవారం 15వేల మంది దర్శిం చుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండ డంతో భక్తుల రాక పెరుగుతోంది. IIలో

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/19.0

ఆకాశం ఎండగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### పోలీసు చట్టాలపై అవగాహన కల్పించాలి



కళాబృందం సభ్యులతో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: పోలీసు చట్టాలు, సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు కళాబృందం సభ్యులకు నూతనంగా రూపొందించిన డ్రెస్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుదలతో పాటు, సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి సైబర్ నేరాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు. పోలీసు చట్టాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, మూఢనమ్మకాల నివారణ, డయల్ 100 ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించాలని కళాబృందం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్‌ఐలు జానిమియా, రామకృష్ణ పాల్గొన్నారు.

### అవగాహనతోనే టీబీ నివారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

కథలాపూర్(వేములవాడ): ప్రజలకు టీబీపై అవగాహన కల్పిస్తేనే నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ అన్నారు. 'టీబీ ముక్త్ గ్రామపంచాయతీ' కార్యక్రమంలో భాగంగా కథలాపూర్ మండలం ఊట్‌పెల్లి గ్రామాన్ని శుక్రవారం అధికారుల బృందంతో ఆయన సందర్శించారు. ఊట్‌పెల్లి గ్రామాన్ని టీబీ ముక్త్ గ్రామపంచాయతీగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. ప్రజలకు టీబీ పరీక్షలు చేసి బాధితులు తక్కువగా ఉన్న గ్రామాలను టీబీ ముక్త్ గ్రామపంచాయతీలుగా ఎంపిక చేశామన్నారు. జిల్లాలో 8 గ్రామాలు అర్హత సాధించాయని, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఎన్‌వీబీడీసీపీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, కథలాపూర్ వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, చిన్న రాజం తదితరులు పాల్గొన్నారు.

### 19 నుంచి సర్వీస్ రెగ్యులరైజేషన్ పరిశీలన

జగిత్యాల: ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం ఇంటెలిజెన్సీ విభాగం నుంచి అందిన నివేదికల ఆధారంగా ఉపాధ్యాయుల జాబితాలు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు, ఎంఈవోలకు పంపించడం జరిగిందని, పరిశీలన కోసం హాజరు కావాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. 1 నుంచి 30 క్రమసంఖ్య గల ఉపాధ్యాయులు ఈనెల 19న, 31–52 సంఖ్యగల గల ఉపాధ్యాయులు 20న హాజరు కావాలని పేర్కొన్నారు. ప్రమోషన్ క్యాడర్‌లో రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ కావాల్సి ఉన్న ఉపాధ్యాయులు 21న సర్వీస్ బుక్, సర్టిఫికెట్స్, ప్రొఫార్మాతో డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు సమాచారం తెలియజేస్తే వారు పనిచేయుచున్న జిల్లా విద్యాధికారులకు నివేదికలు పంపబడునని పేర్కొన్నారు.

### సమ్మెకు మద్దతుగా టీఎన్జీవోల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జగిత్యాలటౌన్: సార్వత్రిక సమ్మెకు మద్దతుగా టీఎన్జీవో ఆధ్వర్యంలో శుక్రవారం భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ మాట్లాడుతూ, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితి రూ.10లక్షలకు పెంచాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అంగన్వాడీ, ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, టీఎన్జీవో నాయకులు అమరేందర్‌రెడ్డి, రాజేందర్, రవికుమార్, రాజేశం, మధుకర్, ప్రమోద్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక లోకం.. నిరసన గళం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఉద్యోగులు, కార్మికులు



మెట్‌పల్లిలో ధర్నా చేస్తున్న కార్మికులు



కోరుట్లలో రాస్తారోకో

జగిత్యాలటౌన్/కోరుట్ల/మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక లోకం కదంతొక్కింది. శుక్రవారం దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా ఆందోళనలు చేపట్టారు. జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు జగిత్యాల పట్టణంలోని పటేల్ చౌక్ నుంచి ర్యాలీగా బయలు దేరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందారి సులోచన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతాంగ, నిరుద్యోగ, కార్మిక, ఉద్యోగ వర్గాల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కోరుట్ల పట్టణంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి పాత చట్టాలు అమలు చేయాలన్నారు. మెట్‌పల్లి పట్టణంలో అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన తదితర కార్మికులు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు రాజ్‌కుమార్, నవీన్, సాయిలు, సుగుణ, గంగు, పద్మ, హనుమంతు, దశరథరం, సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, ఎన్నం రాధ, వంశీకృష్ణ, ఎండీ ఉస్మాన్, సాయిశ్వరీ, నర్సాగౌడ్, జెట్టి లింగం, అందె మారుతి తదితరులు పాల్గొన్నారు.

## దా'రుణాలు'

జగిత్యాల: 'ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ రిసోర్స్ పర్సన్ కీలకంగా వ్యవహరించి రూ.18 లక్షల రుణాలు తీసుకునే ప్రయత్నం చేసింది. మహిళ సంఘాల సభ్యులతో ఒప్పందం చేసుకుని బ్యాంక్ రుణం తీసుకునేందుకు యత్నించగా, మెప్మా అధికారులు ఆరా తీయడంతో ఆమె బండారం బయటపడింది. ఆమె ఒక ఫేక్ గ్రూపును క్రియేట్ చేయడంతో పాటు ఓ కమ్యూనిటీ ఆర్గనైజర్ సంతకం ఫోర్జరీ చేసి రుణం తీసుకునేందుకు ప్రయత్నించింది. ఆ ఫైల్ వివరాలపై బ్యాంకు మేనేజర్‌కు అనుమానం రావడంతో వెంటనే మెప్మా అధికారులకు సమాచారం అందించగా అది ఫేక్ గ్రూప్ అని, వెంటనే లోన్ ఆపేయాలని ఆదేశించారు. దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు విచారణ చేపట్టగా అది ఫేక్ అని తేలడంతో ఆర్పీని తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ సంతకం ఫోర్జరీ చేయడంతో ఆమె, ఆర్పీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. ఇదే క్రమంలో బాధిత సీవోకు జగిత్యాలలో పనిచేస్తున్న మరో సీవోకు మధ్య గొడవ జరిగింది. మరో సీవో ఫేక్ స్టేట్‌మెంట్లతో గ్రూపులు సృష్టించి అనేక లోన్లు ఎత్తినట్లు బాధిత సీవో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించడంతో ఇవన్నీ బయటపడ్డాయి. మరో సీవోను తొలగించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు'.



- మహిళా సంఘాల రుణాల్లో తవ్వినకొద్దీ అక్రమాలే..
- ఫేక్ గ్రూపుల పేరిట తీసుకునేందుకు యత్నం
- కీలకంగా వ్యవహరిస్తున్న రిసోర్స్ పర్సన్లు
- సీవో, ఆర్పీ తొలగింపునకు ఆదేశాలు

మహిళలు సాధికారత సాధించాలనే ఉద్దేశంతో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తుంటారు. కాగా బ్యాంకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో గానీ అనేక మోసాలు జరుగుతున్నాయి. మెప్మాలో పనిచేస్తున్న కొందరు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు మహిళ సంఘాలను ఆసరాగా చేసుకుని వారి పేరిట రుణాలు తీసుకుంటూ మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనల ప్రకారం మహిళ సంఘాల సభ్యులు రుణాలు తీసుకోవాలంటే ఆర్పీలు సమావేశం ఏర్పాటుచేసి ఒక ఫైల్ క్రియేట్ చేసిన తర్వాత వాటిని కమ్యూనిటీ ఆర్గనైజర్ పరిశీలించి సంతకం చేపట్టాలి. అనంతరం టౌన్ మిషన్ కోఆర్డినేటర్ (టీఎంసీ) పరిశీలిస్తారు. రుణానికి సంబంధించిన ఫైల్ బ్యాంక్‌కు వెళ్లిన తర్వాత అక్కడ అధికారులు పరిశీలిస్తారు. మైక్రో క్రెడిట్‌ప్లాన్ అనే వెబ్‌సైట్‌లో సభ్యుల పేర్లు ఉంటేనే అది నిజమైన గ్రూపు అని తెలుస్తుంది. కానీ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యమో, వారిని బురిడి కొట్టిస్తున్నారో తెలియదు కానీ ఫేక్ గ్రూపులకు మాత్రం లోన్లు మంజూరవుతున్నాయి. దర్జాగా రుణాలు పొందుతూ సీవోలు, ఆర్పీలు కమీషన్లు పొందుతున్నట్లు ఆరోపణలున్నాయి.

### పూర్తిస్థాయిలో విచారణ..

ఫేక్ గ్రూపులు క్రియేట్ చేసి రుణం పొందిన ఆరోపణల నేపథ్యంలో జగిత్యాలలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్న ఓ మహిళను, ఆర్పీని తొలగించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫేక్ గ్రూపులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, మెప్మా ఏవో

### అత్యవసరం ఉన్న మహిళలకు గాలం

అత్యవసరంగా డబ్బు కావాల్సిన మహిళలకు రుణాలు ఇప్పిస్తామంటూ ఆర్పీలు, సీవోలు ఆశచూపుతున్నారు. ఒక గ్రూపునకు రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల లోను వస్తే, అందులో రూ.లక్ష నుంచి రూ.80 వేలు కమీషన్ తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో బ్యాంకుల్లో మహిళ సంఘాల గ్రూపుల పేరిట రుణాలు పొందిన ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని బయటపడే అవకాశాలున్నాయి.

## రాయికల్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటిస్తున్న ఆర్డీవో నర్సింహామూర్తి



హాజరైన కౌన్సిలర్లు మ్యాకల అనురాధ, కల్లెడ సునీత

- ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే హాజరు

రాయికల్(జగిత్యాల): రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. జనవరి 29న చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు తీర్మాన ప్రతిని అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఫిబ్రవరి 16న అవిశ్వాస పరీక్షకు అవకాశం కల్పిస్తూ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఆర్డీవో నర్సింహమూర్తి అధ్యక్షతన రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 12 మంది కౌన్సిలర్లు ఉండగా, కేవలం 8వ వార్డు కౌన్సిలర్ కల్లెడ సునీత (బీజేపీ), 11 వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ (కాంగ్రెస్) ఫ్లోర్ లీడర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్డీవో నర్సింహమూర్తి మాట్లాడుతూ, అవిశ్వాస తీర్మాణానికి 2/3వ వంతు ఎనిమిది మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉండగా, పది మంది కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు.

### స్వార్థ ప్రయోజనాల కోసమే అవిశ్వాసం: కల్లెడ సునీత

స్వార్థ ప్రయోజనాల కోసమే రాయికల్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి తెరలేపారని బీజేపీ ఫ్లోర్ లీడర్ కల్లెడ సునీత అన్నారు. అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లే తీరా సంబంధిత చైర్మన్, వైస్ చైర్మన్లతో కుమ్మక్కై అవిశ్వాసం వీగిపోయేలా చేశారని ఆరోపించారు. రాయికల్ పట్టణ ప్రజలు వారిని క్షమించరని అన్నారు.

### అభివృద్ధిని వదిలేసి క్యాంపులకా.. : మ్యాకల అనురాధ

పట్టణంలో అభివృద్ధి పనులను గాలికొదిలేసి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు క్యాంపులకు వెళ్తూ ఎంజాయ్ చేస్తున్నారని కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మ్యాకల అనురాధ ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ తన సొంత పార్టీలోనే వెన్నుపోటు పొడిచే నాయకులున్నారని గ్రహించాలన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల తొలగింపుతో మురికి కాల్వలు చెత్తచెదారంతో నిండిపోయాయని, దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కస్తూరిబా గురుకులం ఏర్పాటుకు స్థల పరిశీలన

సారంగాపూర్(జగిత్యాల): వచ్చే విద్యాసంవత్సరం బీర్‌పూర్ మండలంలో కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తామని డీఈవో జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలంలో కస్తూరిబా బాలికల గురుకుల విద్యాలయం ఏర్పాటుకు తుంగూర్ గ్రామంలోని ఓ అద్దె భవనాన్ని, కోమన్‌పల్లి శివారు గ్రామం డొంకేశ్వరంలో నిరుపయోగంగా పాఠశాల భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం కోమన్‌పల్లి శివారుల్లోని మూడు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం 6,7వ తరగతులను ఇంగ్లిష్ మీడియంతో ప్రారంభిస్తామని వివరించారు. డొంకేశ్వరం శివారులో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయించి తరగతులు ప్రారంభిస్తామన్నారు. శాశ్వత భవన నిర్మాణం కోసం కోమన్‌పల్లి శివారుల్లోని మూడు ఎకరాల స్థలం పరిశీలించామని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. అనంతరం తుంగూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. సారంగాపూర్ కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్నారు. బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంఈవో వాసం భీమయ్య, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



కోమన్‌పల్లి శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు

## ఘనంగా రథసప్తమి వేడుకలు



ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సూర్యోదయానికి ముందే భక్తులు పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి సూర్య భగవానుడికి మొక్కులు చెల్లించుకున్నారు. రథ సప్తమి రోజు నదీ జలాల స్నానం చేసిన భక్తులకు సూర్య భగవానుని ఆశీస్సులు ఉంటాయని పండితుల అభిప్రాయం. అలాగే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రతి మహిళ నైపుణ్యాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ప్రతి మహిళ నైపుణ్యాభివృద్ధి సాధించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం టీ లైఫ్ సంస్థ రాష్ట్ర ఆర్గనైజర్ తాటిపర్తి దీపికారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంస్థను కలెక్టర్, జిల్లా జడ్జి నీలిమ, డీఎస్పీ రఘుచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెల్‌ఫోన్ లోనే ప్రపంచాన్ని చూస్తున్నామని, దానిని ఎక్కువగా మంచికి ఉపయోగించడం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ మన నడవడికలో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. నాణ్యమైన వస్తువులకు మార్కెట్‌లో ధర ఎప్పుడూ ఉంటుందని, వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళలో స్కిల్స్ ఉంటాయని, వాటిని డెవలప్ చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో డబ్బులు రెట్టింపు అని వచ్చే వదంతులు నమ్మవద్దని, ఎవరికి వారే తమకున్న పరిజ్ఞానంతో స్కిల్స్ డెవలప్‌మెంట్ చేసుకోవాలన్నారు. మెప్మా ద్వారా మహిళలకు రుణాలు అందించడం జరుగుతుందని, రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా జడ్జి నీలిమ మాట్లాడుతూ, మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మహిళ ఒక్క క్షణం ఆలోచిస్తే వరకట్న హత్యలుండవని, కుటుంబం బాగుపడాలంటే మహిళల బాధ్యత ముఖ్యమని వివరించారు. ఆర్గనైజర్ దీపికరెడ్డి మాట్లాడుతూ, మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని నిలబడినప్పుడే దేశం బాగుపడుతుందన్నారు. అనంతరం డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ, మహిళల భద్రత పట్ల పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, మెప్మా అధికారి దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, టీలైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల శిరీషరెడ్డి, బొడ్డు అనిత, లావణ్య, సమత, లావణ్య, మానస, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, టీ లైఫ్ ఆర్గనైజర్ దీపికారెడ్డి తదితరులు

## ఎమ్మెల్సీని కలిసిన జగిత్యాల డీఎస్పీ



జగిత్యాలరూరల్: జగిత్యాల డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రఘుచందర్ శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

- పోలీసు పహారాలో.. వేకువజామున
- ప్రభుత్వ దౌర్జన్యంపై సీపీఎం నేతల నిరసన
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

కోరుట్ల: సుమారు ఏడాది కాలంగా కోరుట్లలోని జంబి గద్దె సమీపంలోని ప్రభుత్వానికి చెందిన 926 సర్వే నంబర్‌లో సీపీఎం భూపోరాటంలో భాగంగా నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు తొలగించారు. ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కూల్చివేత కార్యక్రమం కొనసాగింది. నిర్మాణంలో ఉన్న సుమారు 35 కట్టడాలతో పాటు ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 15 కట్టడాలను, రేకుల షెడ్లను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణాలు, స్థలాలకు హద్దులు పెట్టుకున్న కొంత మంది పేదలు కూల్చివేతలను అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేయగా పోలీసుల సాయంతో వారిని దూరంగా పంపించారు. కొంతకాలంగా ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా నిర్మాణాలు చేయవద్దని రెవెన్యూ అధికారులు వారిస్తున్నా స్థానిక సీపీఎం నాయకుల ప్రోద్బలంతో కొంత మంది పేదలు నిర్మాణాలు చేశారు. ప్రస్తుతం కూల్చివేతల ఫలితంగా తాము రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోయామని పలువురు పేదలు ఆవేదన వ్యక్తం చేశారు.



కూల్చివేతకు గురైన అక్రమ నిర్మాణాలు

### ప్రభుత్వ దమనకాండ తగదు: సీపీఎం నేతలు

కోరుట్లలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇండ్లను అధికారులు కూల్చివేయడంతో శుక్రవారం సాయంత్రం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఘటన స్థలాన్ని సందర్శించారు. జగిత్యాలలోని టీఆర్‌నగర్, కోరుట్లలో జంబిగద్దెల వద్ద పేదలు కట్టుకున్న నిర్మాణాలు తొలగించడం రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కొంత మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు చెరువులు, కుంటలు కబ్జాలు చేసి అమ్ముకుంటే పట్టించుకోని ప్రభుత్వం పేదలపై దౌర్జన్యానికి దిగడం విచారకరమన్నారు. కూల్చిన ఇండ్ల స్థలాల్లోనే పేదలు ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలన్నారు. ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, చౌదరి రమేశ్, సలీం, మహ్మద్ పాల్గొన్నారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు సీతారాములు, వాసుదేవారెడ్డి తదితరులు

## క్లుప్తంగా

### పవర్‌లూమ్ కార్మికుల ధర్నా

గంగాధర(చొప్పదండి): ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని పవర్‌లూమ్ కార్మికులు డిమాండ్ చేశారు. విజిలెన్స్ అధికారుల తీరుకు నిరసనగా శుక్రవారం గంగాధర మండలంలోని గర్శకుర్తిలో ధర్నా చేపట్టారు. గ్రామంలో ఇటీవల తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు నిషేధిత కలర్స్ వినియోగిస్తున్నారని పవర్‌లూమ్స్ సీజ్ చేశారన్నారు. వాటిని వెంటనే తెరిపించాలని, బతుకమ్మ చీరల పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పవర్‌లూమ్స్ యజమానులు పాల్గొన్నారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



జగిత్యాల క్రైం: షార్ట్‌సర్క్యూట్‌తో జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయ ప్రాంతానికి చెందిన కొండు శంకరయ్య ఇల్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంట్లో మంటలు లేవగా కుటుంబసభ్యులు బయటకు వచ్చి, కేకలు వేశారు. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి ఆర్పివేశారు. ఇంట్లోని నిత్యావసర వస్తువులు, దుస్తులు, రూ.లక్ష దగ్ధమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

గొల్లపల్లి(ధర్మపురి): మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన ఓ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు పలువురు యత్నించారని స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అగ్గిమల్లకు చెందిన ఉప్పులేటి జలంధర్ కుమారుడు ఇశ్వంత్ గొల్లపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లి, సాయంత్రం స్కూల్ బస్సు దిగి, ఇంటికి వస్తున్నాడు. మినీ వ్యాన్‌లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా అరుస్తూ పరుగెత్తాడు. స్థానికులు వెంబడించగా నిందితులు తప్పించుకున్నారు. బాలుడి చేతికి గాయమైంది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులను గుర్తించేందుకు పలు కూడళ్లకు సంబంధించిన సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు.

### 7 కిలోల కణితి తొలగింపు



జగిత్యాల: వైద్యులు ఓ మహిళ కడుపులో నుంచి 7 కిలోల కణితిని తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా జన్నారానికి చెందిన 50 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో జగిత్యాలలోని శ్రీకర ఆస్పత్రిలో చేరింది. వైద్య పరీక్షలు నిర్వహించి, కడుపులో కణితి ఉందని వైద్యులు శ్రీకాంత్, నాగరాణి నిర్ధారించారు. శుక్రవారం శస్త్రచికిత్స చేసి, తొలగించారు.





# విద్యుత్ మోటార్లే టార్గెట్‌గా చోరీలు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పట్టుకున్న వాహనాలు, విద్యుత్ మోటార్లు

- మద్యం కలిపిన స్నేహితులు.. ముఠాగా ఏర్పడి దొంగతనాలు
- నలుగురి అరెస్టు.. పరారీలో మరొకరు
- మోటార్లు, కార్లు, బైక్‌లు, ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడరూరల్: మద్యం దుకాణాల వద్ద స్నేహితులయ్యారు.. కార్లలో తిరుగుతూ విద్యుత్ మోటార్లే టార్గెట్‌గా చోరీలు చేస్తున్నారు.. వాటిని విక్రయించేందుకు వెళ్తూ పోలీసులకు చిక్కారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. వేములవాడలో ఉంటున్న చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన మహమ్మద్ అజ్గర్ పాషా, భగవంతరావునగర్‌లో ఉండే వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం వెల్‌బెలికి చెందిన బాసవేని నాగరాజు, వేములవాడలోని శుభాష్‌నగర్‌కు చెందిన నీలం మానీష్, వేములవాడలోని న్యూఅర్బన్ కాలనీకి చెందిన దండు శ్రీకాంత్, కామారెడ్డి జిల్లా బతుకమ్మకుంటకు చెందిన షేక్ సోహైల్‌కు మద్యం తాగేచోట స్నేహం కుదిరింది. మద్యానికి బానిసలైన అజ్గర్ పాషా, నాగరాజు, శ్రీకాంత్, మానీష్‌లు సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు వేములవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో విద్యుత్ మోటార్లను ఎంచుకున్నారు. చోరీ చేయడానికి ఒకరోజు ముందు పగలంతా రెక్కీ నిర్వహించి, రాత్రి మోటార్లను ఎత్తుకెళ్తున్నారు. వాటిని కామారెడ్డిలో ఉన్న సోహైల్‌కు విక్రయిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 31 కరెంట్ మోటార్లు చోరీ చేశారు.

**గ్రామాలవారీగా ఎత్తుకెళ్లినవి..**

నమిలిగుండపల్లి కెనాల్ సమీపంలో 4, కోనాయిపల్లిలో 2, అయ్యోరుపల్లిలో 5, నాగయ్యపల్లిలో 2, ఫాజుల్‌నగర్‌లో 1, బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌లో 1, బోయినపల్లిలో 2, నూకలమర్రిలో 7, చెక్కపల్లిలో 1, వట్టింలలో 1, వెంకటంపల్లి 4, ఎదురుగట్లలో 1 విద్యుత్ మోటార్లను దొంగిలించారు. వీటిలో కొన్నింటిని ఇదివరకే విక్రయించారు. మరికొన్ని శుక్రవారం తరలిస్తుండగా మర్రిపల్లి శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని, విచారించగా మొత్తం 31 మోటార్లను 7 కార్లలో తిరిగి చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. ఐదుగురిలో నలుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్ చేయగా, సోహైల్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4.78 లక్షల విలువైన మోటార్లు, 5 కార్లు, 2 ద్విచక్రవాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్, వేములవాడ రూరల్ ఎస్సై మారుతి పాల్గొన్నారు.



రాజన్న గుడి వద్ద భక్తుల సందడి



కోడె మొక్కు చెల్లించుకుంటున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కుటుంబ సభ్యులు



ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్న దృశ్యం

## రాజన్నకు మొక్కుల హారతి

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో భక్తుల రాక పెరుగుతోంది. రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కుటుంబ సభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కు చెల్లించారు. నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. మార్చి 7 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో భాగంగా ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్నారు.

# సీఎంఆర్ గడువు పొడిగింపు

- ఇక గడువు పెంపు కష్టమే

కరీంనగర్ అర్బన్: సీఎంఆర్ బియ్యం సేకరణ గడువు ఈ నెలాఖరు వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ గడువు పెంచాలని కోరుతూ గత నెల 19న, తిరిగి ఈ నెల 3న రాసిన లేఖలకు స్పందించిన కేంద్రం గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 29వరకు మిల్లర్లు 2022–23 సంవత్సరానికి సంబంధించి వానకాలం, యాసంగి బకాయిలను ఇవ్వవచ్చని లేఖలో పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎంఆర్ గడువు పెరగడం ఇది రెండోసారి. ఇక గడువు పెంచడం ఉండబోదని తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

**బకాయిల వసూలే లక్ష్యంగా**

జిల్లాలో సీఎంఆర్ బియ్యం సేకరణలో బకాయిలు లేకుండా వసూలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం గడువులు పెంచుకుంటూపోతోంది. ఈ నెలలో ఇప్పటికి ప్రభుత్వం కేంద్రానికి రెండుసార్లు లేఖలు రాయాల్సి వచ్చింది. గడువు పెంచుతూ కఠినచర్యలు తీసుకుంటూ ఉండడం వల్ల కొంత మేరకు మంచి ఫలితాలు ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి పెరుగుతున్న ఒత్తిడితో మిల్లర్లు కొంతమేరకు దారికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. పలువురు మిల్లర్లు 2022–23 వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా, ఇతర జిల్లాల రైతుల నుంచి సేకరించిన 2,96,900.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుల కెపాసిటీని బట్టి జిల్లాలోని దాదాపు అన్ని మిల్లులకు కేటాయించారు. ఇప్పటివరకు 1,99,901.890 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చారు. ఇంకా 34,863,690 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా... గత డిసెంబర్ 31 వరకే ఉన్న గడువును గత నెలాఖరు వరకు పెంచారు. ఇక 2022–23 యాసంగి సీజన్లో 3,74,825.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు అందించారు. 2,53,634,580 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 60,088 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 1,93,544 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో సీఎంఆర్ బకాయిలు భారీగా ఉండటం అధికారులకు ఇబ్బందికరంగా మారగా బకాయిలు లేకుండా చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుడి దుర్మరణం



మొండయ్య మృతదేహం

గోదావరిఖని(రామగుండం): రోడ్డు ప్రమాదంలో గోదావరిఖని గంగానగర్‌కు చెందిన రెడ్డిపాక మొండయ్య(60) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మొండయ్య సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. గురువారం సాయంత్రం పెరుగు కొనుక్కొని, ఉదయ్‌నగర్ నుంచి రాజీవ్ రహదారి దాటుతుండగా మంచిర్యాల నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన డివైడర్‌పై పడి, తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని తొలుత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అల్లుడు చంద్రగిరి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన గోదావరిఖనికి చెందిన పువ్వుల మురళీధర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ప్రేమ పేరిట యువతి కోసం గాలింపు

జగిత్యాల క్రైం: ప్రేమించానంటూ జగిత్యాలలో ఓ యువతి కోసం గాలిస్తున్న ఒంగోలు జిల్లాకు చెందిన యువకుడిని స్థానికులు గుర్తించారు.. తలాకొంత డబ్బు పోగేసి, అతన్ని తిప్పిపంపించారు. వారి వివరాల ప్రకారం.. ఒంగోలు జిల్లా పాలమూరు మండలం మొగురుచెర్ల గ్రామానికి చెందిన యువకుడికి జగిత్యాలలోని ఓ ఆస్పత్రిలో పనిచేసే యువతితో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తర్వాత ఫోన్‌లో వేధిస్తుండటంతో అతని వివరాలు తెలుసుకుంది. ప్రేమ పేరుతో పలువురిని మోసం చేశాడని తెలియడంతో కొన్ని రోజుల క్రితం తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. దీంతో ఆ యువకుడు రెండు రోజుల కిత్రం జగిత్యాల వచ్చి, స్థానిక జంబిగద్దె, బైపాస్‌రోడ్ ప్రాంతాల్లో ఆమె కోసం వెతుకుతున్నాడు. శుక్రవారం స్థానికులకు అనుమానాస్పదంగా కనిపించాడు. ఆరా తీయగా తాను ప్రేమించిన యువతి కనిపించడం లేదని, వెతుకుతున్నానని చెప్పాడు. వారు తలాకొంత డబ్బు పోగేసి, అతనికి ఇచ్చి స్వస్థలానికి పంపించారు.

### జ్వరంతో చిన్నారి మృతి

రామగిరి(మంథని): నాగెపల్లికి చెందిన మాటేటి సాద్విక(4) చికిత్స పొందుతూ మృతి చెందింది. నాలుగు రోజులుగా పాప జ్వరంతో బాధ పడతుండగా తల్లిదండ్రులు స్వాతి, సతీశ్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం చనిపోయింది.

# కారులో ప్రేమ జంట పరార్

- కిడ్నాప్ చేశాడంటూ యువతి కుటుంబసభ్యుల కేకలు
- స్వస్థలంలో ఫిర్యాదు చేయాలన్న పోలీసులు

జగిత్యాలక్రైం: ఓ ప్రేమ జంట కారులో పారిపోగా.. తమ కూతురిని కిడ్నాప్ చేశాడని ఆమె కుటుంబసభ్యులు కేకలు వేశారు.. స్థానికులు కారు వెంట పరుగులు పెట్టినా వారు దొరకలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సియత్‌నగర్ మండల కేంద్రానికి చెందిన లావణ్య జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండగట్టుకు చెందిన బత్తిని మధు ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యారు. తర్వాత అది ప్రేమగా మారింది. మధు ఈ నెల 12న భద్రాద్రి కొత్తగూడెం వెళ్లి, లావణ్యను కారులో తీసుకువచ్చాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు ఆమె కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ ఆధారంగా మధు కొండగట్టుకు చెందినవాడని గుర్తించి, శుక్రవారం ఇక్కడికి వచ్చారు. అతని సోదరి జగిత్యాలలోని ఓ దుస్తుల షాపులో పని చేస్తుందని తెలుసుకొని, వెళ్లారు. అక్కడే ఉన్న మధు, లావణ్య వీరిని చూసి కారులో పారిపోయారు. తమ కూతురిని కిడ్నాప్ చేశాడని కేకలు వేయడంతో స్థానికులు కారు వెంట పరుగులు తీశారు. కానీ, వారు తప్పించుకున్నారు. బాధితులు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, తమ కూతురు కిడ్నాప్ అయిందని మొరపెట్టుకున్నారు. పోలీసులు విచారణ జరుపగా లావణ్య, మధు మేజర్ అని తేలింది. స్వస్థలంలో ఫిర్యాదు చేయాలని సూచించడంతో వారు వెనుదిరిగారు.

# గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

- మృతుడు సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



రమేశ్ (ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు రమేశ్ గుండెపోటుతో మృతిచెందారు. మృతుని కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రమేశ్ శుక్రవారం ఉదయం ఇంట్లో స్నానం చేసి, దుస్తులు వేసుకుంటుండగా గుండెపోటు వచ్చి, కుప్పకూలారు. కుటుంబసభ్యులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధిత కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు రైతుబంధు సమితి జిల్లా మాజీ కన్వీనర్ పాల రామారావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ పార్లమెంట్ అధ్యక్షుడు వరప్రసాద్, సుల్తానాబాద్ మాజీ సర్పంచులు అంతటి పుష్పలత, అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సునీల్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు సతీశ్ గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ గౌడ్, పొన్నం సత్యం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులు రాత్రి దహనసంస్కారాలు నిర్వహించారు. రమేశ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

**10 రోజుల్లో 15 మంది మృతితో చర్చ**

సుల్తానాబాద్ పట్టణంలో గత 10 రోజుల్లో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లుతో కలిపి 15 మంది మృతిచెందారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కరోనా వ్యాక్సిన్ కారణంగానే ఇలా జరుగుతోందని చర్చించుకుంటున్నారు. ప్రతీ విషయానికి ఆందోళన చెందడం వల్ల కొన్ని రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని, ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యాయామం చేయాలని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు రమాదేవి సూచించారు. మానసిక ప్రశాంతతతోనే రోగాలు దూరమవుతాయని తెలిపారు.

# తాళం వేసిన ఐదిళ్లలో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): లక్ష్మీపూర్‌లోని మూడు ఇళ్లలో దొంగలు పడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల నర్సయ్య, అట్టెల నర్సయ్య, పసుల మల్లేశంల కుటుంబసభ్యులు గురువారం తమ ఇళ్లకు తాళాలు వేసి, ఊరెళ్లారు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి తాళాలు పగులగొట్టి, చొరబడ్డారు. పసుల నర్సయ్య ఇంట్లో అరతులం బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, అట్టెల నర్సయ్య ఇంట్లో రూ.3 వేలు చోరీ చేశారు. పసుల మల్లేశం ఇంట్లో ఏమీ దొరక్కపోవడంతో వస్తువులన్నీ చిందరవందర చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ బాధితుల ఇళ్లను పరిశీలించారు.

**సంగాపూర్ గ్రామంలో..**

హుజూరాబాద్‌రూరల్: సంగాపూర్ గ్రామంలో తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగాపూర్‌కు చెందిన ప్రమీల, వేణుగోపాల్ రెడ్డిల కుటుంబసభ్యులు గురువారం తమ ఇళ్లకు తాళం వేసి, ఊరెళ్లారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రమీల ఇంటి తాళం పగులగొట్టి, రూ.65 వేలు రూ.30 వేల విలువైన బంగారం ఎత్తుకెళ్లారు. వేణుగోపాల్ రెడ్డి ఇంటి తలుపులు ధ్వంసం చేశారు. చుట్టుపక్కలవారి అలి కిడితో పరారయ్యారు. ఈ ఇంట్లో ఎలాంటి వస్తువులు పోలేదు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు బాధితులు తెలిపారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గొట్టె హరీశ్ (25) హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతను అవివాహితుడు. కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు యశోద, రవిల రోదనలు మిన్నంటాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో కరీంనగర్ కోర్టు ముగ్గురికి జైలుశిక్ష విధించింది. ట్రాఫిక్ ఏసీపీ ఎండీ.సర్వర్ వివరాల ప్రకారం.. నగరంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ 12 మంది పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి ఒకరికి 10 రోజులు, మరొకరికి 5 రోజులు, ఇంకొకరికి 3 రోజుల జైలుశిక్షతోపాటు రూ.7,500 జరిమానా విధించారు. మిగతా తొమ్మిది మందికి రూ.14 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# చలో మేడారం..

- వనదేవతల జాతరకు ఆర్టీసీ సన్నద్ధం
- రీజియన్ నుంచి 750 బస్సులు

కరీంనగర్: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ అధికారులు, సిబ్బంది సన్నద్ధం అయ్యారు. ఈనెల 18 నుంచి 25 వరకు రీజియన్ పరిధిలోని 11డిపోల నుంచి మేడారానికి 750 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆర్‌ఎం సుచరిత 11డిపోల పరిధిలో అధికారులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. ప్రయాణీకులకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈసారి మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సు (ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు)ల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో రద్దీ పెరిగే అవకాశముందని, ఆ దిశగా ఏర్పాట్లు చేశారు.

**750 ప్రత్యేక బస్సులు**

రీజియన్ పరిధిలో కరీంనగర్–1, కరీంనగర్–2, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, హుజూరాబాద్, కోరుట్ల, గోదావరిఖని, హుస్నాబాద్, మంథని, మెట్‌పల్లి డిపోలు ఉండగా ఈనెల 18 నుంచి 25 వరకు రీజియన్ నుంచి 750 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నారు. 325 కరీంనగర్ రీజియన్‌కు సంబంధించిన బస్సులు కాగా జేబీఎస్, నిజామాబాద్, మెదక్ రీజియన్‌లకు సంబంధించి మరో 425 బస్సులను అందుబాటులో ఉంచేలా ఏర్పాటు చేశారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు కరీంనగర్ బస్టాండ్‌లో మూడు క్యూలైన్ల సెంటర్లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు, తాగు నీటి సౌకర్యం, తాత్కాలికంగా మూత్రశాలలు, వైద్య శిబిరాలు, ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం వంటి అంశాలపై దృష్టిసారించారు.

**సిబ్బందితో గేట్ మీటింగ్**

మేడారం జాతరను పురస్కరించుకుని కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆర్‌ఎం సుచరిత ఆర్టీసీ సిబ్బందితో గేట్‌మీటింగ్ నిర్వహించారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా, ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లు బస్సులను ఓవర్ టేక్ చేయకుండా క్రమపద్ధతిలో నడపాలని, ప్రమాదాలకు అవకాశం కల్పించవద్దని, భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్లు భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ, కరీంనగర్–1,2డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

**రద్దీని బట్టి బస్సులు పెంచుతాం**

మేడారం జాతరకు ఏర్పాట్లు చేశాం. 750 వరకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించాం. రద్దీని బట్టి అద్దె బస్సులు సైతం నడపడానికి ప్రయత్నిస్తాం. సంస్థలోని వివిధశాఖల అధికారులను బస్టాండ్‌లో అందుబాటులో ఉంచాం. ప్రభుత్వం కల్పించిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుంది. – ఎస్.సుచరిత, ఆర్టీసీ ఆర్‌ఎం